# ఆర్జన

*–గిడుగు రాజేశ్వరరావు*

'ఆ అబ్బాయి చూడు. పువ్వులా తెమిలి, ఎలా బడికెళ్ళిపోతున్నాడో. నువ్వింకా ఇలా ఈడిగిల పడుతూ ఉన్నావు' అని మా అమ్మ నా చిన్నతనంలో మందలించేది. అలా అంటున్న మా అమ్మ మీద కాక, ఆ దారిన పోతున్న కుర్ర వెధవ మీద బోలెడంత కోపం వచ్చేది. అరవై ఏళ్ళు నెత్తికొస్తున్న ఈ వయసులో కూడా అలాటి పరిస్థితే మళ్ళా ఎదురైంది నాకు.


బాల్కనీలో నా వాలు కుర్చీలో వార్తాపత్రిక పట్టుకు కూర్చున్నాను. "చూడు నాన్నా! ఆ ఫ్లాట్స్‌లోకి ఎవరో కొత్తగా వచ్చినట్టున్నారు. ఆ ముసలాయనకు ఎంత లేదన్నా డెబ్బై ఐదు దాటే ఉంటాయి. ఈ కాంప్లెక్స్ అంతా తనదే అన్నట్టు తిరుగుతూ వుంటాడు. నువ్వు కూడా కాసింత ఉదయమూ సాయంత్రమూ నాలుగడుగులు వేస్తే నీ బరువు తగ్గి ఆ మోకాలి నొప్పులు కూడా తగ్గుతాయి. రక్తపోటు కూడా అదుపులో ఉంటుంది." ఇదీ మా అమ్మాయి వరుస. దీన్ని డాక్టర్ చదువు చదివించినందుకు నన్ను ఇలా సతాయిస్తోంది. అందులో నే ఒంటరి వాణ్ణయినాక మరీనూ. నా మోకాలి నొప్పి మరింత ఎక్కువైనట్టు అనిపిస్తుంది. ఎండుటాకులా గలగలా ఎగురుతూ సునాయాసంగా రోడ్డు మీద కనపడ్డ ముసలివాడంటే అర్థం లేని కోపం ఈర్ష్యా వస్తుంది.

అరసవిల్లిలో నా బతుకు నే బతుకుతూ వుంటే హస్తినాపురం తెచ్చి పడేసింది చాలక ఎన్ని మాటలు అంటున్నావే అమ్మలూ! ఇక్కడి భాష నాకు రాదాయె. తెలిసిన వాళ్ళయినా లేరాయె–అంటాను. "నిన్ను రాళ్ళెత్తమన్నానా, గుళ్ళెత్తమన్నానా? మీనా దీదీ అన్నీ చేసి పెడుతుంది. అడిగి చేయించుకోడమే. మనవలు రెండు కొట్టగానే వచ్చి ఇంట్లో ఉంటారు. నేనూ అల్లుడూ సాయంత్రం వచ్చేస్తాము" అని క్లాస్ తీసుకొంటుంది.

నాకు తారసపడ్డ వాళ్ళతో నాకొచ్చిన ఇంగ్లీషులో మాట్లాడబోతే వాళ్ళు హిందీలో మాట్లాడతారు. ఆ ఇంగ్లీషు వార్తాపత్రిక రెండు పేజీలు తిప్పితే చాలు ఇక దాని నిండా హత్యలు, ఆత్మహత్యలు, కిడ్నాపులు, మానభంగాలు, పేలుళ్ళు, దుర్మార్గాలు. నా కాలు బయట పెట్టాలనే అనిపించదు. ఈ సమస్యలకి తోడుగా ఈ ముసలాడొకడు దూరాన ఆ బాల్కనీలోనో ఈ కాంప్లెక్స్ రోడ్డు మీదో కనిపిస్తూ ఉంటాడు– తెల్లని లాల్చీ, పైజామా, బుగ్గమీసాలు, నున్నటి తలమీద రెపరెపలాడే తెలికపాటి తెల్ల వెంట్రుకలూ వాడూను. స్కూలుకి పోయే చిన్న చిన్న పిల్లలు ఎదురొతే ఏదో చెవిలో రహస్యం చెప్పినట్టు వంగిపోతూ వుంటాడు. ఇక ఈ కాంప్లెక్స్‌లో ఉన్న వాళ్ళంతా ఆడామగా ఉద్యోగస్థులే. కార్లూ స్కూటర్లూ వేసుకొని ఉదయాన్నే పోతూ వుంటారు. నా శరీరం నే చెప్పినట్టూ వినేలా వుంటే అమ్మాయి చేత రోజూ పాఠం చెప్పించుకోవడమెందుకూ? సరే పోనివ్వమని ఇంటికి అటూ ఇటూ నాలుగడుగులు వెయ్యడం, లిఫ్ట్ ఎప్పుడైనా పని చెయ్యకపోతే ఇరవై మెట్లు భారంగా లెక్కపెట్టుకొంటూ ఎక్కడం, నా వాలు కుర్చీలో కూర్చోడం ప్రారంభించాను.

ఆరోజు ఉదయం ఎదురుగా జోరుగా వస్తున్న కారు ఒక్క కుదుపుతో ఆగింది. చిన్న సైకిలేసుకుపోతున్న ఎనిమిదేళ్ళ అమ్మాయి కుడివేపుకి మళ్ళబోయి పడిపోయింది. నాకంటే మూడు నాలుగడుగులు ముందు నడుస్తున్న ఆ ముసలాడు "అమ్మో! ఎంత అదృష్టం! కారు సరిగా ఆగింది" అంటూ ఆ అమ్మాయికి చెయ్యి అందించి లేపాడు. ఆ మాటలు చెవిన పడ్డాక కానీ అతను తెలుగువాడే అని నాకు తెలిసిరాలేదు. ఆ మాటే నేను అతనికి వినపడేలా అనేశాను.

"ఎందుకూ సందేహం? పదహారణాల తెలుగువాణ్ణి. ఈ పైసల కాలంలో ఇంకా నా



"రండి అలా కబీరు మఠం దాకా వెళ్దాం" అని ఆహ్వానించాడు కూడా. ఈమారు వస్తాలెండి అని అప్పటికి తప్పించేసుకొన్నాను. ఆపాటి నడక నాకు అలవాటు లేక కాస్త ఆయాసమనిపించి, బ్రతుకు జీవుడా! అని బాల్కనీలో నా వాలు కుర్చీలో కూలబడ్డాను.

నోటికి అణాలే వస్తాయి. నా పేరు విశ్వనాథం. మాది రాజమండ్రి" అన్నాడు తన మీసాల్లోంచి నవ్వు ఒలకబోస్తూ.

నాకేమో హిందీ అస్సలు రాదాయె. బయట కాలు పెట్టాలంటే బెరుకు. ఒక్కడిని... అని ఇంకా నేను నా గోడు ముగించేలోగానే నేను ఛలోక్తి వేసినంతగా స్పందించాడు.

"నాకు మాత్రం పెద్దగా హిందీ వచ్చి ఏడ్సిందా ఏం? అలా తివార్‌పూర్ బజారులో తిరుగుతున్నప్పుడూ, ఇంట్లో ఆ అలీఘుడ్ దీదీ మాట్లాడుతున్నప్పుడూ చెవిని పడ్డ మాటలకు అలవాటు పడి కాస్త ఇప్పుడిప్పుడే మాట్లాడుతున్నాను. మన ఇళ్ళలో పిల్లలు మూడేళ్ళు రాగానే తెలుగు మాట్లాడేస్తారు. వాళ్ళకి మనం కూర్చోపెట్టి నేర్పుతున్నామా? ఇంట్లోని వాళ్ళూ తోటి పిల్లలూ మాట్లాడగా వినివినీ నేర్చేసుకోడం లేదూ?" అని మాట్లాడుతూ నన్ను కాంప్లెక్స్ గేటు దాకా నడిపించుకుపోయాడు. నేను అక్కడ నిలబడిపోయాను.

రోజూ అదే కుర్చీలో కూర్చొని నే చూసిన దృశ్యాలే చూస్తూ విన్న గొంతులే వింటూ, నా మోకాలి చిప్పలను అరచేతులతో రాసుకొంటూ గడిపే నాకు కాసింత ఉపశాంతి కల్గించిందా మార్పు. ఆ మధ్యాహ్నం భోజనంలోకి వండిన ఘూట్ గోబీ కూర చాలా రుచిగా ఉన్నదన్నానని మీనా దీదీ చాలా సంబరపడిపోయింది.

నాలుగు రోజుల తర్వాత ఒక ఉదయం విశ్వనాథం రోడ్డు మీద కనపడ్డప్పుడు పలకరింపుగా- ఎందాకా? అని అడిగాను.

"ఆ- ఏముందీ- అలా తివార్‌పూర్ పోస్టాఫీసు దాకా పోయి కొన్ని కార్డులూ ఇన్‌లాండ్ లెటర్లూ తెచ్చుకోవాలని బయలుదేరాను."

నేనూ రానా? అని అన్నానో లేదో భళ్ళున నవ్వాడు. "మీరు రాదలిస్తే నా అభ్యంతరమేమిటి? ఇద్దరు అడుగులు కలుపుతూ పోతే ఎంత దూరమైనా కరిగిపోతుంది. మాటామంతీ ఈ

బతుక్కి రుచి కల్పిస్తాయి. లేకపోతే మనకీ యంత్రాలకీ తేడా ఏమిటి?" అని అన్నాడు.

మా కాంప్లెక్స్ గేటు దాటి, అడ్డుగా పోతున్న పెద్ద రోడ్డు దాటి ఇంకో కోలనీలోంచి దూసుకుంటూ నన్ను తనతో తీసుకుపోయాడు. సరిగ్గా మా ఎదుటనే పోస్టాఫీస్ ఉంది. తనక్కావలసిన కార్డులూ, కవర్లూ తీసుకొన్నాడు.

"ఇక మన కాంప్లెక్స్‌కి చేరుకోవాలంటే మరో దారి కూడా ఉంది. ఇలా ఎడమవేపు తిన్నగా పోయి అక్కడ రావి చెట్టు దగ్గర కుడి మలుపు తిరుగుతే కబీర్ మఠం దగ్గిరకు పోతాం. ఆ ప్రక్కనే మన నివాసాలకు మరో గేటు ఉంది" అంటూ నన్ను నడిపిస్తున్నాడు.

"ఇటు చూశారూ! ఈ నాలుగు గుడిసెలూ వరుసగా ఉన్నాయి. ఇందులో అంతా దగ్గర బంధువులే. ఇనుప పనిముట్లు చేసి అమ్మే లోహార్లు. భగభగమండే ఆ మంటల్లోని ఇనుప కమ్మీని తీస్తున్నాడే- ఆ తలపాగా వాడు, వాడే ఆ ముఠాకి పెద్ద. ఆ మంట చుట్టూ ఎంత బేఫికరుగా కూర్చొని పనులు చేసుకొంటున్నారో చూడండి. ఆ పిల్లలు చూశారా? ఆ మంటకి దగ్గరగానే ఉరుకులు, పరుగులు, ఆటలు. మన ఇళ్ళలో ఇంత నిశ్చింతగా పిల్లల్ని విడిచిపెడతామా?" అని చెప్పుకుపోతూ వుంటే ఆ మంటకి దగ్గరగా ఉన్న తలపాగా వాడు విశ్వనాథాన్ని చూస్తూనే "పండిట్‌జీ రామ్‌రామ్" అని దండ కడియాన్ని సవరించుకొంటూ పలుకరించాడు. అలాటి పలుకరింపులకు బాగా అలవాటు పడ్డవాడులా చిరునవ్వుతో 'రామ్‌రామ్' అని ప్రతిస్పందించాడు. నన్ను నడిపించుకుపోతున్నా ఇంకా విశ్వనాథం ధోరణి వాళ్ళ మీదనే సాగుతోంది.

"మధ్యాహ్నం ఎప్పుడైనా ఇటు వచ్చినప్పుడు వీళ్ళ ఆడవాళ్ళని చూసి తీరాలి. మంచాలు రోడ్డు వారగా వాల్చేసుకుని ఒకరి తలను ఇంకొకరు దువ్వెనతో దువ్వుతూ పేలు కుక్కుకుంటూ మాటా మంతీ ఆడుకొనే దృశ్యం చూడ ముచ్చటగా ఉంటుంది. రేపటి గురించి వాళ్ళకేమైనా చింత ఉందా అనిపిస్తుంది. వాళ్ళ ఆత్మవిశ్వాసం చూస్తే నాకాశ్చర్యం వేస్తుంది. ఎంతెంత సంపాదించుకొంటున్నా మన వాళ్ళెవ్వరూ అలా ఎందుకు బతకలేకపోతున్నారో నాకర్థం కాదు".

అలా సాగుతున్న ఆ ధోరణి సరిగ్గా రావి చెట్టు దగ్గర మలుపు తిరిగేచోట ఆగింది. "కైసోహో ఓ లాల్‌చంద్‌జీ!" అని కేకవేశాడు. అతనెవరా అని నే చూసేలోగా ఆ చెట్టు మొదట్లోని చప్టా మీద శిలా విగ్రహంలా తల వంచుకు కూర్చున్న నల్లనివాడు తలపైకెత్తి చూశాడు. సన్నగా ఎముకల గూడులా ఉన్న ముసలివాడు కళ్ళు చికిలించాడు. ఆ చూపులో ఏదో వెలుగు. ఎంత లేదన్నా వాడికి విశ్వనాథం కన్నా ఒకటో రెండో ఏళ్ళు పెద్ద అన్నట్టు కనపడ్డాడు.

"ఇదిగో కబీర్ మఠం, ఇదిగో ఇదే మన నివాసాలాకు రెండో గేటు". అని ఆనాటి పాదయాత్ర ముగించాడు. "మొన్నటిదాకా మా అబ్బాయీ కోడలూ ఆ రింగ్ రోడ్డుకి దగ్గరగా ఫ్లాట్స్‌లో ఉండేవారు. ఈమధ్యనే మీరుంటున్న ఫ్లాట్స్‌కి దగ్గరగా మారిపోయాం. అందుకే ఈ రోడ్లన్నీ నాకు కొట్టిన పిండి". నన్ను మా ఫ్లాట్స్ దిశగా సాగనంపుతూ ఏదో చెప్ప మరచినట్టు వెనుతిరిగి "సాయంత్రం వేళ ఆ మఠంలో ఏవో ప్రవచనాలూ ప్రసంగాలూ సాగుతూ ఉంటాయి. వినసొంపుగా ఉంటాయి. మీకు ఓపిక ఉంటే కూర్చొని వినవచ్చు" అన్నాడు.

నేను నా బాల్కనీలోకి చేరుకొని వాలుకుర్చీలో ఆయాసం తీర్చుకొంటూ ఆలోచిస్తున్నాను. విశ్వనాథం తన ధోరణిలో విడిచిపెట్టిన కొన్ని మాటలూ ఆలోచనలూ నా మెదడు పొరల్లో కదలాడుతూనే ఉన్నాయి- ఇంకా.

'మీ పిల్లలు కానీ నా పిల్లలు కానీ మరీ నోట్లో వేలు పెడితే కొరకలేని వాళ్ళు కారు. రెక్కలొచ్చాక వాళ్ళకు నచ్చినట్టూ బతకనివ్వడమే మంచిది. వాళ్ళ అవసరాలకీ, కాలానికీ సరిపోయినట్టు వాళ్ళ పిల్లల్ని పెంచుకోనివ్వండి. మనకెందుకూ చింత? ఏదైనా మన సలహా అడిగినప్పుడే మన పాత్ర".

నా మనసులోని అశాంతినీ సందేహాలనూ పసిగట్టి ఇస్తున్న చిట్కాలు కావు గదా అని నా భుజాలు తడుముకొనేలా ఉన్నాయి కొన్ని మాటలు.

"ఈ కాలం ఈతరం బతుకులే వేరు. రెండు జీతాల కోసం ఆడామగా కష్టపడాలి. ఉరుకులూ పరుగులూ. రోజుకి ఇరవై నాలుగు గంటలు

వాళ్ళకి చాలవు. మనకు ఆ ఇరవై నాలుగ్గంటల్లో పది పన్నెండు గంటలు నిద్రలో గడచినా మిగిలిన కాలం ఎలా గడపాలన్నదే ప్రశ్న. ఈ ఉత్తరాలు రాయడం, జవాబులు కోసం ఎదురుచూడ్డం, వచ్చినవి చదువుకోడంలో కొంత కాలం దొర్లిపోతుంది. శరీరం పెట్టే బాధలు ఉన్నా వాటి మీంచి ఆలోచనలు కొంత వేరేగా మళ్ళుతాయి."

విశ్వనాథం అభిప్రాయాలు ఎలా ఉంటేనేమి కానీ పేచీకోరు కాడు. నేను రాను మొర్రో అంటే నన్ను ఎక్కడికో లాక్కుపోయే రకం కాదు. నిత్యం ఏదో వెతుకుతున్నట్టు పనికట్టుకు తిరిగినా అతని వెంట నేను నీడలా తిరగాలనుకోడు. నాకు తోచనప్పుడు అతనితో అడుగులు కలపడం కొంత ఉత్సాహంగానూ కొంత కాలక్షేపంగానూ వుంది.

ఒక సాయంత్రం లార్సన్ రోడ్డు దగ్గర ఉన్న చిన్న పార్కులో ఇద్దరం కూర్చున్నాం. మాటల సందర్భంలో నేనే అన్నాను. ఢిల్లీ వచ్చిన కొత్తల్లో ఒంటరిగా ఇంటి బయట కాలుపెట్టే వాడినే కాను- అన్నాను. పత్రికల్లోని వార్తలు చదివి ఇంట్లోనే మగ్గిపోయేవాణ్ణి. నాలా పంచెలు కట్టేవాళ్ళు కూడా మన కాంప్లెక్స్‌లో తక్కువే. మీరు కూడా పైజామాలో ఉంటే చూసిన రోజున మీరు తెలుగువారు కాదేమో అనే ఊహించాను. అని చెప్పగానే పగలబడి నవ్వాడు.

"నిరాశతో ఆత్మహత్యలు, దురాశతో దుర్మార్గాలూ జరుగుతున్న మాట నిజమే. మునుపు వార్తా ప్రసారానికి ఇన్ని సదుపాయాలుండేవి కావు. ఇప్పుడేమో ఎక్కడెక్కడ జరిగినవీ ఒక ప్లేట్‌లో పెట్టి అందించినట్టు ఉదయాన్నే పత్రిక ఒక్క పేజీలో మన ముందు ఉంచుతుంది. సమాజాన్ని విడిచి ఎక్కడికి పారిపోతాం చెప్పండి? ఒకమారు కాలు మడతపడి పడిపోతే రెండోమారు జాగ్రత్తగా నడుస్తాం కానీ నడకే మానేస్తామా? మా అబ్బాయి రింగ్ రోడ్డు దగ్గర ఉంటున్నప్పుడు నాకేమీ తోచేది కాదు. తెగించి అలా ముద్రిక బస్సు ఎక్కి కాస్త ఇటూ అటూ తిరిగేవాణ్ణి. ప్రయాణీకులు వాళ్ళ తొందరలో నా పంచె అంచులు కాళ్ళతో తొక్కేసేవారు. తర్వాత దాదాజీ, పాపాజీ, అంకుల్‌జీ అంటూ సారీ చెప్పి నన్ను ఎక్కడో సీటు చూపించి కూర్చోపెట్టేవారు. అప్పుడు కొన్ని పైజామాలు కొనుక్కున్నాను. ప్రజలు మంచివారే. ముసలి వాళ్ళని ఎంతో అభిమానంగా చూస్తారు" అని పెద్దగా వివరణ ఇచ్చాడు.

అలా మా ఇద్దరి స్నేహం సుమారుగా ఒక ఏడాదికి పైనే సాగింది. నా శరీరం కూడా కాసింత స్వాధీనంలో ఉంటోంది. ఈ నోటా ఆ నోటా విన్న హిందీ మాటలు స్పష్టంగా అర్థమైపోతున్నాయి. నేను ధారాళంగా మాట్లాడలేకపోతేనేం, బొట్లర్ ఇంగ్లీషులా అవసరానికి తగినంత మాట్లాడేస్తున్నాను. ఒక సాయంత్రం నాక్కూడా తోచనివేళ అతని ఫ్లాట్‌కి వెళ్ళాను. ఏదో

## ప్రయాణం

వేసిన రంగు వెలిసిపోతుంది
అరువు తెచ్చుకున్న ఆకృతి ఆవిరౌతుంది
నిజం దాగుతుంది, కాసేపే
భయపడుతూ, భయపెడుతూ!
ఆనక బెలూన్‌లోని గాలిలా
విక్రమించి కవచాన్ని ఛేదిస్తుంది!
అస్తిత్వాన్ని సాధిస్తుంది!!
ఆ నిజం కాలం గుండెల్లో కాంతి
ఆ కాంతే కాలాన్ని వెలిగించే నిజం!
ప్రతి క్షణం ఒక అగ్ని కణం
అది చేసే నిరంతర నిశ్శబ్ద రణం
ప్రకృతి కృతికి కొత్త భాష్యం చెపుతుంది
జగతి గతికి కొత్త మార్గం చూపుతుంది
కదిలినా, కదిలించినా
కాలినా, కాల్చినా
కదనంలో కదం తొక్కినా
పయనంలో పథం మార్చినా
చైతన్యం జీవితం, జ్వాల జీవితం!
ప్రవాహం జీవితం, కాలం జీవితం!
వెలుగు కోసం వెదకులాట జీవితం!!
నీ నడకకి గమ్యమూ,
దిశా నిర్దేశమూ చేసేది
నిన్ను అదుపు చేస్తోన్న ఇప్పుడు
అదృశ్యంగా చేసే అనుభవాల చప్పుడు!

*– బెల్లంకొండ లక్ష్మణసూరి*

రాసుకొంటున్నాడు. మీ ఏకాగ్రతకి భంగం కల్గించలేదు కదా- అన్నాను. అతని కలవాటైన శైలిలో నవ్వాడు. "పనా పాటా ఏకాగ్రతకి? మనం చేసే ప్రతి పనికీ లాభనష్టాలు బేరీజు వేస్తే కుదరదు. కొన్ని పనులైనా మన మనసుకు నచ్చేవి చెయ్యాలి. నేను సరదాకి డైరీ రాస్తూ వుంటాను. ఈ మధ్యనే కాస్త పరాకూ మతిమరపూ వచ్చి డైరీ రాయడంలో వెనకబడిపోతున్నాను. పదండి అలా పోదాం" అన్నాడు.

ఒక వేకువన ప్రక్క ఫ్లాట్ క్రింద వేపచెట్టు ముందు పది మంది చేరిన అలికిడి కిటికీలోంచి కంటపడింది. బాల్కనీలోకి వెళ్ళి చూశాను. వారి మౌన భాషణం, కదలికా విషాదాన్ని సూచిస్తోంది. విశ్వనాథం కన్నుమూశాడని తెలియగానే ఆశ్చర్యం కలిగింది. ఒక్కరోజు ముందే నాతో కబీర్ మఠం దాకా వచ్చాడు. ఏమాత్రం ఆయాసమనీ నీరసమనీ చెప్పిన గుర్తులేదు. వెళ్ళి చూశాను. తల దగ్గర దీపం నిశ్చలంగా వెలుగుతోంది. నిద్రలో ఉన్నట్టు రెండు కళ్ళూ మూసి ఉన్నాయి. పెదవులు చిన్నగా తెరచుకొన్నట్టు ఉన్నాయి. వాటి మధ్య నుండి చిరునవ్వు దొరలిపోవడం లేదు కదా అన్న భ్రాంతి. విశ్వనాథం ఇంక నాతో అడుగులు కలపడన్న నిజాన్ని మనసు స్వీకరించడానికింకా సిద్ధంగా లేదు. ఇంత అనాయాస మరణం సాధ్యమా? ఎలా సాధించాడు? ఇదే ప్రశ్న మెదడులో కదలాడింది.

కాలచక్రం ఎవ్వరికోసమూ ఆగదు కదా. పన్నెండు రోజులు గడిచి ఒక వారం కూడా వెళ్ళిపోయింది. ఒక శనివారం సాయంత్రం నాలుగడుగులు వేసి రావాలని నే బయలుదేరుతూ వుంటే విశ్వనాథం కొడుకు నాకోసం వచ్చినట్లు మా అమ్మాయి చెప్పింది. ప్రశ్నార్థకంగా అతనివేపు చూశాను. "ఎవరో లాల్‌చంద్‌ట. అతనికేదో ఇవ్వాలట. రోజూ అనుకొంటూనే మరచిపోతున్నారట. తీరా అతను దారిలో కనిపించినపుడు గుర్తొస్తోందట- మరపు ఎక్కువైపోతోందని మా నాన్నగారు డైరీలో రాసుకొన్నారు. మీతో కలిసి తిరిగేవారు కదా. మీకు ఏమైనా తెలుస్తే చెప్పండి' అని అనునయించాడు. ఆ మాట వినగానే రావి చెట్టు క్రింద తరచూ తారసపడే నల్లరాతి విగ్రహం లాటి వృద్ధుడు నా మనసులో మెదిలాడు. కానీ వాళ్ళ ఇద్దరి మధ్య ఉన్న వ్యవహారం లాటిదేదీ నాకు తెలియదు.

సరే, ఏ సంగతీ అతన్ని కలిసి ఆ తర్వాత చెప్తానని మాట ఇచ్చాను. అలా బాధ్యత వేసుకొని ఆ సాయంత్రం రావిచెట్టు దిశగా వెళ్ళాను. ఎదురుగా నిల్చున్నాను.

కంటికి కాసింత మీదుగా అరచెయ్యి అడ్డుపెట్టుకొని కళ్ళు చికిలించి నన్ను చూస్తూనే గుర్తుపట్టాడు. మా ఇద్దరి మధ్యా మాటామంతీ లేకున్నా విశ్వనాథంతో కలిసి తిరిగిన కారణంగా ముఖపరిచయం లేకపోలేదు. బొక్కిపళ్ళ మధ్య ఎర్రని నాలుకను తిప్పుడూ "బడేసాబ్ నహీ ఆయే క్యా, ఆజ్" అన్నాడు. వాడి దృష్టిలో నేను కేవలం విశ్వనాథం జతగాడిగానే గుర్తింపు పొందాను మరి. అదే మొదటి ప్రశ్న అవడంతో చేసేది లేక ఆకాశం వంక చేతులు చూపుతూ చేదు నిజాన్ని చెప్పేశాను.

నమ్మలేనట్టు పిచ్చిగా చూశాడు. ఆ కళ్ళలో నీళ్ళు చిమ్మాయి. నుదుటిని చేతి వేళ్ళతో కొట్టుకున్నాడు. ఏడ్చాడు. నాకు హిందీలో సున్నితంగా మాట్లాడ్డం చేతకాలేదేమో. నీకు ఆయన ఏమైనా ఇవ్వాల్సి ఉందా అన్నాను.

తల అడ్డంగా ఊపుతూ చీత్కారం చేసినట్టుగా నా వేపు చూశాడు. విశ్వనాథం పోయాడని చెప్పీ చెప్పగానే వాడు ఏడ్చినందుకు నేను అలాటి క్షుద్రమైన ప్రశ్న వేశానని కోపగించుకున్నట్టు కనపడ్డాడు. హిందీలో అంతకన్నా సున్నితంగా వివరించడం నాకు రాకపోయింది.

"బడే సాబ్ చూపిన ప్రేమకు నేనేం చేసినా ఋణం తీరదు" అన్నాడు. ఇక వాడు వెక్కివెక్కి ఏడుస్తూ చెప్పిన వాళ్ళ స్నేహం కథ వినడమే నా వంతుగా అలా చెవులప్ప చెప్పి గట్టు మీద కూర్చున్నాను.

"సన్నగా వానపడుతోంది. ఆయన కాలి జోడు బొటనవేలి ఉంగటం తెగిపోయింది. కాలుతో జోడు ఈడ్చుకొంటూ వచ్చి తెగినదాన్ని కుట్టి పెట్టమన్నారు. నేను శ్రద్ధగా కుడుతున్నాను. నావేపు నా చేతి వేళ్ళ వేపూ చూస్తూ ఎంత వయసు నీకు అని చాలా ప్రేమగా అడిగారు. నేనేమన్నా

చదువుకొన్నానా నా వయసు చెప్పడానికి. దేశం రెండు ముక్కలై అల్లర్లు జరుగుతున్నప్పుడు నేనూ నా భార్యా కర్నాల్ వేపు నుండి రెండు తెలిసిన కుటుంబాలతో కలిసి, నా పెద్ద కొడుకుని భుజాల మీద మార్చుకొంటూ ఇటు వచ్చేశామని మాత్రం చెప్పాను. అంచలంచలుగా ఉత్తర ఢిల్లీ చేరుకున్నాము.

ఈ వయసులో కష్టపడుతున్నావు పిల్లల సహాయం లేదా?- అని అడిగారు బడేసాబ్. పెద్ద కొడుకు పెళ్ళి చేసుకుని అండమాన్ వెళ్ళిపోయాడు. ఇక్కడ మాకు పుట్టిన చిన్న కొడుకు రిక్షా తొక్కుతానన్నాడు. వాడికి నా వృత్తి అంతగా అలవడలేదు. చదువుకోనూ లేదు. వాళ్ళకి నేను బరువు కాకుండా నా ఖర్చులైనా సంపాదించుకోవాలి గదా. బతికినంత కాలం ఊపిరి పీల్చడం, విడవడం తప్పదు- అన్నాను. జేబులోంచి ఏభై రూపాయల నోటు తీసి ఇచ్చారు. కంగారు పడుతూ నా చేతి వేళ్ళు రెండు చూపించి అంత ఛుట్టా (చిల్లర) నేనెక్కడ తేగలను. నా రోజు సంపాదనే ఏభై ఉంటే అదృష్టం అన్నాను. పోనీ ఉండనీ అని వెళ్ళిపోతూ వుంటే- మీరే ఈమారు ఇటు వచ్చినప్పుడు రెండు రూపాయలు ఇవ్వండి- అన్నాను. ఆయన వల్ల ఏదో పొరపాటే జరిగినట్టు బాధపడి నోటు తీసుకుని వెళ్ళిపోయారు. మర్నాడే నాకు రెండు రూపాయలతో ఒక మిఠాయి పొట్లం అందించారు.

ఆతర్వాత ఉదయం కానీ మధ్యాహ్నం కానీ ఇటు వచ్చినప్పుడు నా దగ్గర పది నిముషాలైనా కూర్చొని కష్టం సుఖం మాట్లాడడం రివాజైపోయింది. పండో కాయో, మిఠాయో నా చేతిలో పెట్టందే వెళ్ళేవారు కాదు. నేనేమి ఇచ్చినా వద్దని అనకు. నువ్వు నా తమ్ముడివి అనుకోమని, నేను సందేహిస్తే మందలించేవారు. చలికాలం ఈసారి తీవ్రంగా ఉండేలా ఉంది. కమలా మార్కెట్‌లో నీకొక ఉన్ని కోటు తెస్తానన్నారు మొన్ననే. అది అందుకొని నే చచ్చేదాకా వేసుకునే రాత నా నొసట లేదు"- అని కథ ముగిస్తూ నుదుటి మీద మరోసారి చేత్తో కొట్టుకొని బావురుమన్నాడు లాల్‌చంద్.

నాతో లోకాభిరామాయణం సాగించే విశ్వనాథం ఎన్నడూ ఈ అనుబంధం గురించే చెప్పలేదేమీ అన్న ప్రశ్న నా మెదడులో మిగిలిపోయింది. నాతో కలిసి వచ్చినప్పుడు ఎలాటి కానుకా వీడికి ఇచ్చిన జ్ఞాపకం కూడా నాకు లేదు. నేను నాక్కావలసిన సమాచారం సేకరించాను. తలవంచుకొని కబీర్ మఠం దాకా వచ్చేక నా మెదడులోని ప్రశ్నకు జవాబుగా నా మనసు సమాధానం చెప్పింది. "అనాయాస మరణం అనుకోకుండా వచ్చి పడ్డది కాదు. అది విశ్వనాథం ఆర్జించుకున్న వరమే..." ●

## మళ్ళీ మళ్ళీ

మట్టితనంలోంచి
మనిషితనంలోంచి
మంచితనంలోంచి
మారాకు తొడుగుతుంటాను
సాగరాత్మలో సౌందర్యాత్మకంగా
భావోద్వేగంలో రసనిష్పన్నంగా
శోధనలో సాధన ధ్యేయంగా
రూపుదిద్దుకుంటాను
అపరిపక్వతలో పరిపక్వ ఝరియై
విషాదంలో వివేక నాదమై
వికృతిహాసంలో ప్రకృతి లాస్యమై
నిశ్శబ్ద సంగీతాన్ని వినిపిస్తుంటాను
నిర్వేదంలో చైతన్య సూత్రంగా
నిశ్చలత్వంలో నిర్మలంగా
చదల ఎదలలో వెన్నెల కిరణంగా
పులకించి పలకరిస్తుంటాను
నీరసించిన మనసులో నిప్పుకణికనై
శిలల నిట్టూర్పుల్లో శిల్పారామమునై
శ్రామిక జీవన గమనంలో జ్ఞానదీపికనై
నిరంతరం ప్రవహిస్తుంటాను
గాయంలో కన్నీరుగా
కాలంలో మున్నీరుగా
ఇంద్రజాలంలో పన్నీరుగా
మళ్ళీ మళ్ళీ పరిమళిస్తుంటాను.

– సి. కామేశ్వరరావు